"అయ్యో... అయ్యో" అంటూ కంగారుపడింది అలివేణి.

"ఎవడ్రా అది?" అంటూ వీధిలోకి పరుగుతీసాడు సూర్యనారాయణ.

వీధిలో ఎవరూ లేరు. గుమ్మం ఎక్కుతూ అప్పన్న పంతులు కనిపించారు.

"ఏమిటి మాష్టారూ... ఏమయిది?" అన్నాడు అతడు.

"వెంకటపతి మాష్టారుకి దెబ్బ తగిలింది."

"అదెలా?"

"ఎవడో వెధవ రాయి విసిరి పారిపోయాడు."

అలివేణి తెచ్చిన నీళ్లతో దెబ్బని కడిగి, మందు రాసి ఇంటిదాకా దిగపెట్టి వచ్చాడు అప్పన్న పంతులు.

దెబ్బ మోపుచేసి వెంకటపతికి కొంచెం జ్వరం వచ్చింది. అయినా పెట్టుకున్న ప్రయాణం మానుకోడం ఇష్టంలేక ఉదయాన్నే బయలుదేరాడు.

ఆ రాత్రి సాయం పడుకున్న సహోద్యోగి సుబ్బారావు స్టేషనుకి వచ్చి అతన్ని రైలు ఎక్కించాడు.

రైలు కదిలింది. ఒంట్లో జ్వరంగ ఉండడంవల్ల కొంచెం చలిగా ఉంది. తల మీదుగా దుప్పటి లాక్కొని ఒక మూలగా బెంచీ మీద కూర్చున్నాడు వెంకటపతి. రైలు కదిలిన పది నిమిషాలకి కాళ్లకి ఏదో చల్లగా తగిలింది. ముసుగు తొలగించి ఏమిటా అని చూచాడు.

కాళ్ల దగ్గర గంగులు.

"గంగులూ" అన్నాడు ఆశ్చర్యంతో.

"తప్పయిపోయింది. క్షమించండి మాష్టారూ" అన్నాడు ఏడుపు గొంతుతో.

"దేనికి? నువ్వెక్కడికి వెళ్తున్నావు?"

"ఎక్కడికీ వెళ్లటంలేదు. మీతో చెప్పిపోదామనే రైలు ఎక్కాను. మీరంటే నాకెంతో ఇష్టం మాష్టారూ! మిమ్మల్ని కొట్టలేదు."

తనకి దెబ్బ తగిలింది అని వాడు నిజంగా బాధపడ్తున్నట్లు అనిపించింది వెంకటపతికి.

"రాయి విసిరింది నువ్వేనా?"

"అవును."

"ఎందుకు విసిరావు?"

"ఆ హెడ్‌మాష్టరు సుబ్బులు సొమ్ము తీసాడని చెప్పబోతూంటే...."

"సుబ్బులు నిజంగా సొమ్ము దొంగిలించాడా?"

"అవును. సుబ్బులు ఆ సొమ్ము నా కోసం తీసాడు. నేను వద్దని చెప్తూతున్నా వినకుండా, నాతో చెప్పకుండా ఆ పని చేసాడు. అయిదు రూపాయలు యిస్తే గంగుల్ని పాసు చేస్తానని

